క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

వేమూరు: మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ యల్లమాటి మోహన్ అధ్యక్షతన వహిస్తారని అన్నారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావలెనాని ఆయన కోరారు.

సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



రేపల్లె: ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు చికిత్సలు పొందేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు శివప్రసాద్ వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి గురువారం చెక్కులు అందజేశారు. దూళిపూడికి చెందిన మోర్ల శ్రీనివాసరావుకు రూ.1,24,385, సింగుపాలెంకు చెందిన యార్లగడ్డ కృష్ణవేణికి రూ.62,983 సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా కొసరాజు దేవ్‌కుమార్



అమర్తలూరు(వేమూరు) : కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా రైతులకు సేవలు అందించడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ కొసరాజు దేవ్ కుమార్ అన్నారు. అమర్తలూరు మండలంలోని పెదపూడి వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా కొసరాజు దేవకుమార్, డైరెక్టర్లుగా తెనాలి వీరయ్య, జూటూరు తిరుపతి రావు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్, డైరెక్టర్లను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాయినాథుడికి విశేష పూజలు



బాపట్ల అర్బన్: బాపట్ల కొత్త బస్టాండ్ వద్ద జీబీసీ రోడ్డులోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో వార్షిక పూజలలో భాగంగా తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలను గురువారం చేపట్టారు. ఉదయం స్వామి వారికి కాకడ హారతి, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. విశేష అలంకరణ అనంతరం గురుపాదుక పూజా కార్యక్రమం, మధ్యాహ్నం హారతి ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు కర్ల పాలెం మోహనరత్న సాయిస్వామి, పమిడిగటం సాయికిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆషాఢ సారె సమర్పణ



తెనాలిటౌన్: స్థానిక షరాఫ్ బజార్‌లోని శ్రీ సువర్చలా సమేత శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శ్రీ సువర్చలా అమ్మవారికి భక్తులు గురువారం ఆషాఢమాసం సారె భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఆలయ ఈవో హరిప్రసాద్, వంశపరంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో అమ్మవారికి భక్తులు ఆషాఢమాసం సారెను సమర్పించి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా షరాఫ్‌బజార్‌లోని ఊరేగింపుగా బయలుదేరి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి సారె సమర్పించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు సామూహిక శ్రీ విష్ణు సహస్రనామా పారాయణం చేసి అన్నమాచార్య కీర్తనలు అలపించారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలోని సువర్చలా అమ్మవారికి భక్తులు ఆషాఢమాసం సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులు ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కర్షకుల నీటి కష్టాలు తీరేనా..!

- సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు
- ఆయిల్ ఇంజిన్‌ల ద్వారా సాగు నీరు అందిస్తున్న వైనం
- పెట్టుబడి ఖర్చు పెరిగిపోతుందని రైతుల ఆవేదన



వేమూరు మండలంలో ఆయిల్ ఇంజిన్ ద్వారా సాగు నీరు అందిస్తున్న దృశ్యం

వేమూరు: రైతులు వర్షాలపై ఆధారపడి వరి వెద సాగు చేపట్టారు. అయితే మే నెలలో ముందస్తుగా వర్షాలు పడడంతో వర్షాలు పడతాయని ఆశించిన రైతులకు నిరాశ ఎదురయ్యింది. జూన్‌లో వర్షాలు రాకపోవడంతో పొలాలకు సాగు నీరు అందక రైతులు నానా బాధలు పడుతున్నారు. జూలై నెలలో కూడా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

95,000 ఎకరాలలో...

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో దాదాపు నియోజకవర్గంలోని రైతులందరు వరి సాగు చేపట్టారు. నియోజకవర్గంలో మొత్తం 95,000 ఎకరాలలో వరి సాగు చేపట్టగా ఎక్కువ శాతం మంది రైతులు వెద పద్ధతిన సాగు చేస్తున్నారు. వేమూరు నియోజకవర్గంలో రైతులు ప్రధానంగా వరి, అక్కడక్కడ వాణిజ్య పంటలు సాగు చేస్తారు. ప్రభుత్వం సకాలంలో సాగు నీరు విడుదల చేయకపోవడం, వర్షాలు సకాలంలో రాకపోవడం వెద సాగుకు నీరు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నెల 12వ తేదీన ప్రభుత్వం అరకొరగా సాగు నీరు విడుదల చేసింది. అయితే అరకొరగా విడుదల చేసిన సాగు నీరు వెద సాగు పొలాలకు అందక రైతులు ఆయిల్ ఇంజిన్‌లపై ఆధారపడి పొలాలకు నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్ ఇంజిన్‌ల ద్వారా పొలాలకు సాగు నీరు అందించడంతో పెట్టుబడి ఖర్చు పెరిగిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎకరానికి అదనంగా రూ.6 వేలు

ఎకరానికి డీజల్ ఆయిల్ 30 లీటర్లు, ట్యూబ్‌లు, ఇంజిన్ ద్వారా పొలాలకు నీరు అందిస్తున్నారు. దీంతో రైతులకు వ్యవసాయ ఖర్చు ఎకరానికి రూ.6 వేలు అదనంగా భారం పడుతుంది. కొన్ని పొలాలకు సాగు నీరు అందక రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. గత కొద్ది రోజులుగా ఎండల ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల సాగు నీరు అందని పొలాలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సాగునీటి కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం రైతులు పట్ల కనికరం చూపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు కన్నీళ్ల కష్టాలు మొదలయ్యాయి. వర్షాలు లేకపోవడం, సాగునీరు సకాలంలో రాకపోవడంతో రైతులు కాలువలకు అడ్డాలు వేసి ఆయిల్ ఇంజనిల ద్వారా సాగు నీరు అందిస్తున్నారు.

ఆయిల్ ఇంజిన్‌లపై ఆధారపడుతున్నాం



ప్రభుత్వం సాగునీరు సకాలంలో విడుదల చేయకపోవడంతో వర్షంపై ఆధారపడి వెద సాగు చేశాను. వర్షాలు కూడా సకాలంలో రాక సాగు నీరు అందక నానా అవస్థలు పడుతున్నాను. సాగు నీరు పూర్తిగా అందకపోవడంతో ఆయిల్ ఇంజిన్‌లపై ఆధారపడుతున్నాం.

– రాయపూడి బుజ్జిబాబు, రైతు, బలిజేపల్లి

రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం పూర్తి స్థాయిలో సాగు నీరు విడుదల చేయకపోవడంతో పొలాలకు సాగు నీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం సకాలంలో సాగు నీరు అందించి రైతులను ఆదుకోవాలి. ఈ ప్రభుత్వంలో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– ఆలూరు యోన, రైతు, జంపని

పాలిథిన్ వినియోగంతో వాతావరణం కాలుష్యం

ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్రకుమార్



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవిచంద్రనాయక్

రేపల్లె: పాలిథిన్ నివారణతో ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొంటుందని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలిథిన్ నిషేధంపై పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పాలిథిన్ వినియోగం హద్దు దాటిపోయిందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్‌ల వినియోగంతో ఉద్భవించిన ఉద్గారాలతో భూమి నాశనమవ్వటమే కాకుండా వాతావరణం కాలుష్యం ఏర్పడుతుందన్నారు. ఫలితంగా ఓజోన్ పొరపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పాలిథిన్‌ను నివారించి ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. పర్యావరణానికి హితమైన మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, అధ్యాపకులు మందపాటి దాసు, డాక్టర్ ఎం.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెలో వానతో ఉపశమనం



రేపల్లె: రేపల్లె పట్టణంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కురిసిన వర్షంతో ప్రజలు కొంత ఉపశమనం పొందారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రచండ భానుడి భగభగలతో తల్లడిల్లిన ప్రజానీకం ఒక్కసారిగా కురిసిన వర్షంతో సేద తీరారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా అరగంటకు పైగా కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది.

గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

చుండూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. చుండూరు మండలంలోని పెనుగుదురుపాడు, వేటపాలెం గ్రామాల్లో గురువారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. వేటపాలెం గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిల్లో అమలు చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం కన్నా అదనంగా సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ హారికకు పరామర్శ



పిట్టువారిపాలెం(కర్లపాలెం): ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రథమ పౌరురాలైన జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికను బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు ఏత్ర అశ్వనీరెడ్డి బుధవారం పరామర్శించారు. ఇటీవల టీడీపీ, జనసేన నాయకులు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులపై దాడి చేసిన నేపథ్యంలో అశ్వనీరెడ్డి హారిక ఇంటికి వెళ్లి పరామర్శించి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో పాటు పార్టీ శ్రేణులంతా అండగా ఉంటారని హారికకు మనోధైర్యం కల్పించినట్లు ఆమె తెలిపారు. పరామర్శించిన వారిలో మహిళా నాయకురాలు ఉప్పాల శారద, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏత్ర శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, మంత్రి ఓఎస్‌డీ ఏసురత్నం

తెనాలిరూరల్: రైతులు ఎదుర్కొంటున్న పొలాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ వెల్లడించారు. అయితానగర్ గోలి డొంక నేలపాడు పరిధిలో వర్షాలు, వరదల సమయంలో పంటలు ముంపుకు గురవుతున్నాయని రైతులు గత ఐదారేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సర్వే జరిపి కాలువ తవ్వకానికి పనులు ప్రారంభించారు. ఆ పనులను గురువారం పరిశీలించిన తహసీల్దార్ మాట్లాడుతూ అధిక వర్షాల సమయంలో నీరు బయటకు పోయే మార్గం లేక రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారని, ఇదే విషయాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులతో చర్చించి, రెవెన్యూ, ఇరిగేషన్, హౌసింగ్ శాఖల సమన్వయంతో సర్వే జరిపించామని, గతంలో కనీసం ఇక్కడ బోది కాలువ కూడా లేదని చెప్పారు. సర్వే అనంతరం ప్రత్యేకించి కాలువ తవ్వకానికి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కాలువ దక్షిణం వైపున కాలువలో కలపడం ద్వారా పొలాల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. రైతుల సమస్యల చొరవ చూపిన మంత్రికి, అధికారులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఎన్. ఏసురత్నం, పలువురు రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడు మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన రాడ్ బెండింగ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కంచర్ల జగదీష్ (30) రాడ్ బెండింగ్ కార్మికుడిగా చేస్తూ అప్పుడప్పుడు హోల్డింగ్ డ్రైవర్‌గా వెళుతుంటాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కె.ఆనంద్ తెలిపారు.

21న పోస్టాఫీసుల్లో లావాదేవీలకు అంతరాయం

తెనాలి: పోస్టల్ శాఖ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇనీషియేటివ్‌లో భాగంగా అప్‌గ్రేడ్ చేసిన వ్యవస్థ, డివిజనులోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 22వ తేదీనుండి అమలుచేయనున్నట్లు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాసు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అధునాతనమైన డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు మారేందుకు ఈనెల 21వ తేదీన డౌన్‌టైము షెడ్యూలు చేయటమైందని తెలిపారు. డేటా మైగ్రేషన్, సిస్టమ్ ధృవీకరణలు, కాన్ఫిగరేషన్ ప్రక్రియలను సులభతరం చేయడానికి, కొత్త వ్యవస్థ సజావుగా సమర్ధవంతంగా ఉందని నిర్ధారణ కోసం 21న పోస్టాఫీసుల్లో ఎలాంటి ప్రజాలావాదేవీలు నిర్వహించేది లేదని ఆయన తెలిపారు. ఈ స్వల్పకాలిక అంతరాయం అనివార్యమైందనీ, ఖాతాదారులు సహకరించాలని కోరారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఏర్పరచుకోవాలి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రక్షిత్ పేర్కొన్నారు. టీబీ ముక్తభారత్ అభియాన్ ఇంటెన్సీ ఫైడ్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని చెంచుపేటలోని శబరి వృద్ధాశ్రమంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వృద్ధాశ్రమాల్లో, నైట్ షెల్టర్‌లో, ప్రభుత్వ వసతి గృహాల్లో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ 60 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, షుగర్ వ్యాధిగ్రస్తులు తప్పని సరిగా క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి, హెచ్‌వి వాకా వెంకట దిలీప్‌కుమార్, కె.సరోజిని, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేయటం బాబు నైజం

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



బోలాయపాలెంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి



నాగరాజుపాలెంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోన

కర్లపాలెం: ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని మోసం చేయటమే బాబు నైజమని బాపట్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కర్లపాలెం మండల పరిధిలోని నాగరాజుపాలెం, బోలాయపాలెం గ్రామాలలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు అధ్యక్షతన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో చంద్రబాబు జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలను తాము అమలు చేస్తామని మరిన్ని పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ముందుకు తీసుకువెళతామని మాట ఇచ్చారని, అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా పథకాలను అమలు చేయలేకపోయారని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో మహిళలకు ఆసరా, చేయూత లాంటివి అమలు చేశారని వాటిని చంద్రబాబు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఏమైందని.. ఈ పథకాలన్నీ అమలు చేయమని మాత్రమే వైఎస్సార్‌సీపీ జగన్ నాయకత్వంలో పోరాడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, దొంతిబోయిన జయభారత్‌రెడ్డి, షేక్ సలాం, యువజన విభాగం మండల అధ్యక్షుడు చిక్కాల సాగర్, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కే జాకీర్‌హుస్సేన్, నాయకులు అక్కల శ్రీనివాసరెడ్డి, పులుగు మునిచంద్రారెడ్డి, కారంకి ప్రసాద్, పేరాల వెంకట సురేష్, దొంతిరెడ్డి శివారెడ్డి, యారం ఇసాక్, సలగల ధర్మేంద్ర, షేక్ ఇమ్రాన్, షంషీర్ ఖాన్, మనోహర్, పులుగు స్వామిరెడ్డి, మార్పు రత్నం, దుండి శ్రీనివాసరెడ్డి, లాల్ సాహెబ్, కరిముల్లా, చిన లాల్‌సాహెబ్, మీరావళి, పీర్ సాహెబ్, సోమసుందరం, పాండురంగారావు, శంకర్‌రావు, విజయ్‌కుమార్, మహిళలు తదితరులు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ విశేష కృషి

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చెంచయ్య



వైఎస్సార్‌సీపీ అడవి పంచాయతీ-2 నూతన కార్యవర్గం

బాపట్ల అర్బన్: మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ విశేష కృషి చేసిందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య పేర్కొన్నారు. పార్టీ బాపట్ల మండలం అడవి పంచాయతీ–2 కార్యవర్గ ఎంపిక బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా కొక్కిలిగడ్డ చెంచయ్య పార్టీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా కొక్కిలిగడ్డ ఏడుకొండలు, ఉపాధ్యక్షులుగా శింగోతి శ్రీనివాసరావు, సంగాని సురేష్, జనరల్ సెక్రటరీలుగా బొజ్జ గోవిందు, దండుప్రోలు సుబ్బారావు, కొక్కిలిగడ్డ స్వాములు, ట్రెజరర్‌గా పిట్టు ఏడుకొండలరెడ్డి, సెక్రటరీలుగా పిట్టు స్వాతి, ఆర్.కుమారి, కొక్కిలిగడ్డ ప్రశాంతి, పి.అంజమ్మ, జాలి లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అవనిగడ్డ స్వాములు, మోపిదేవి దుర్గారావు, కొక్కిలిగడ్డ శేషగిరిరావు, సంగాని అంకయ్య, అద్దూరి రమేష్, సీహెచ్ ఆఫ్రిద్, సీహెచ్ కృష్ణ, వల్లభూని ఆంజనేయులు, మోపిదేవి అక్కేశ్వరరావు, పెసికం నాగేంద్రబాబు, నాయుడు నాగబాబు, నాయుడు అమీన్‌బాబు, అవనిగడ్డ సూరి, కొక్కిలిగడ్డ స్వాములు ఉన్నారు.

హిందూ ధర్మం అన్ని ధర్మాలలో సనాతనమైనది

బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ



గ్రామ ధార్మిక సమితి సమావేశంలో పొన్నపల్లి

ఆళ్లమూడి(భట్టిప్రోలు): హిందూ ధర్మం ప్రపంచంలో మిగతా అన్ని ధర్మాల కన్నా సనాతనమైనదని సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఆళ్లమూడిలో గురువారం గ్రామ ధార్మిక సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణ గ్రామ ధార్మిక సమితి వహించాలని ప్రతి నెలా సమితి సమావేశాలు నిర్వహించి ప్రతి పౌర్ణమికి సామూహిక హారతులు, సత్సంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, రేపల్లె ఖండ్ కన్వీనర్ క్రాప రవికుమార్, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ, గ్రామ ధార్మిక సమితి కన్వీనర్ వేపూరి సోమేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ రాజులపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్య అంతిమ లక్ష్యం వ్యక్తిత్వ వికాసం



మోరల్ స్పిరిచ్యువల్ క్లాసులో విద్యార్థులు

భట్టిప్రోలు: విద్య అంతిమ లక్ష్యం వ్యక్తిత్వ వికాసం అనే దివ్య సూక్తిని ఆచరణలో ఉంచుటకు భగవాన్ శ్రీ సత్యసాయి బాల వికాస్ ప్రారంభించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు చందలూరి రామ కోటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో శ్రీ సత్యసాయి బాల వికాస్ మోరల్ స్పిరిచ్యువల్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్య లక్ష్యం కేవలం పుస్తక పరిజ్ఞానం సంపాదించటం కాదని తెలిపారు. నేర్చుకున్న విషయాలను నిజ జీవితంలో ఆచరించగలగాలని చెప్పారు. పక్షులు, జంతువులు విద్యాభ్యాసం లేకనే బ్రతుకుతున్నాయని మనం అలా కాకుండా బలమైన ఉత్తమమైన వ్యక్తిత్వాన్ని పొందుటకు అధ్యయనం చేయాలని వివరించారు. కార్యక్రమంలో బాల వికాస్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు



శాకంబరి అలంకారంలో అమ్మవారు

తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని గంగాపర్వాతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం శాకాంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో హరిప్రసాద్ పర్యవేక్షణలో అర్చకులు వడ్లమూడి రాఘవేంద్ర వరప్రసాద్ ఉత్సవాలను వైభవోపేతంగా జరిపారు. అమ్మవారిని వివిధ కూరగాయలతో విశేషంగా అలంకరించారు. పూజాది కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని పలు రకాల కూరగాయలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఏటా ఆషాఢమాసంలో ఆలయంలో శాకాంబరి ఉత్సవాలను ఘనంగా జరుపుతామని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, పాడి పంటలతో విలసిల్లాలని ఆకాంక్షిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతికి నివాళి



కొల్లూరు : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఉమ్మడి గుంటూరు జిల్లా స్టీరింగ్ కమిటీ మాజీ సభ్యులు నర్రా అప్పారావు (అప్పయ్య) (78) వృద్ధాప్యంతో కూడిన అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. బుధవారం రాత్రి కొల్లూరులోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు గురువారం వెల్లడించారు. అధ్వానంగా ఉన్న కొల్లూరు శ్మశాన వాటికను సైతం గ్రామంలోని పలువురి సహకారంతో అభివృద్ధి పరిచి పలువురి మన్ననలు పొందారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అప్పయ్య భౌతిక కాయాన్ని సందర్శించించి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, బావిరెడ్డి వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, మాజీ సర్పంచి తోట రామలింగేశ్వరరావు, నాయకులు కూచిపూడి మోషే, సింగం కృష్ణప్రసాద్, గరిక రమేష్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.